WWW.EPAPER.MAHADAILY.COM

# మహా పత్రిక





ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

14-4-2025



## రైతు సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

- వరదలతో దెబ్బతిన్న కాలువల మరమ్మత్తులు
- వేసవి ముగిసేలోగా కాలువ పూడికతీత
- కాలువలు ఆధునికరణ చేపట్టాలి
- భూములకు అందించేలా చర్యలు

05

## పేదలపై ఆంధ్రాగిరి గిరి

- చిరు వ్యాపారులపై గిరి గిరి ఫైనాన్స్ దందా
- మితిమీరిన వడ్డీలతో కుదేలవుతున్న చిరు వ్యాపారులు
- వచ్చిన ఆదాయం అంతా వడ్డీలకే సరి
- అర్ధరాత్రి, తెల్లవారుజామున ముక్కుపిండి వసూళ్ళు..
- ప్రభుత్వ అనుమతులు లేకుండా యథేచ్ఛగా వ్యాపారం..

నిరుపేదల జీవితాలపై "ఆంధ్రాగిరి"గిరి నడు స్తోం ది.. పేదల అవసరాలను ఆసరాగా చేసుకుని ఆంధ్రా గిరులు అడ్డగోలు వ్యాపారాలు చేస్తున్నారు.. అధిక వడ్డీలతో గిరిగిరి, ఫైనాన్స్ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.. పేదల అవసరాలను అడ్డుగా చేసుకుని ఫైనాన్స్ రూపంలో అధిక వడ్డీల తో పేదలకు ఇస్తూ ముక్కుపిండి వసూళ్ళు చేస్తు న్నారు..



07



# మధిరకు మహార్దశ

06

## రూ.128 కోట్లతో మధిర పట్టణానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ

- డిప్యూటీ సిసీఎం భట్టివిక్రమార్క
- మధిర మండలంలో 12 కోట్ల 75 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన
- మధిర పట్టణం, మండలంలో డిప్యూటీ సీఎం శంఖుస్థాపనలు



మధిర, మహా

రూ.128 కోట్లతో పట్టణానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మిస్తున్నామని మధిర రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం మధిర మండలంలో పర్యటించి పలు రోడ్డు నిర్మాణ పనులకు శంకు స్థాపనలు చేశారు టి.యు.ఎఫ్.ఐ.డి.సి. నిధులు 128 కోట్ల అంచ నా వ్యయంతో మధిర మున్సిపాలిటీ అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి నిర్మాణ పనులకు, వంగవీడు గ్రామంలో వంగవీడు నుండి నక్కలగరుబు వరకు 5 కోట్ల 25 లక్షలతో చేపట్టిన బి.టి.రోడ్డు నిర్మాణ పనులకు, కృష్ణాపురం గ్రామంలో కృష్ణాపురం నుండి భగవాన్లపురం వరకు 3 కోట్లతో చేపట్టిన బి.టి.రోడ్డు నిర్మాణ పనులకు, ఆత్కూరు గ్రామంలో ఆత్కూరు ఆర్ అండ్ బి రోడ్డు నుండి ముస్లిం కాలని వయా పిల్లిగుట్ట వరకు 4 కోట్ల 50 లక్షలతో చేపట్టిన బి.టి.రోడ్డు నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు.

## ఏజెన్సీ వైద్య సేవలపై జిల్లా యంత్రాంగం స్పెషల్ ఫోకస్

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 13 (మహా): భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మరియు అధికారుల సమన్వయంతో వైద్య ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపి మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు.



08

FOLLOW: @ANNTELUGU
14-4-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

# వనజీవి రామయ్య జీవితం స్ఫూర్తిదాయకం

## రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

## వనజీవి రామయ్య పార్థివ దేహానికి నివాళులర్పించిన మంత్రి పొంగులేటి

**ఖమ్మం - మహా:** వనజీవి రామయ్య జీవితం స్ఫూర్తిదాయకమని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం మంత్రి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి తో కలిసి ఖమ్మం రూరల్ మండలం రెడ్డిగూడెం లో దివంగత పద్మశ్రీ వనజీవి(దరిపల్లి) రామయ్య పార్థివ దేహానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వనజీవి రామయ్య మృతి చాలా దురదృష్టకరం, బాధాకరమని అన్నారు. పద్మశ్రీ గ్రహీత వనజీవి రామయ్య మనకు కలిపించనంతగా దూరమయ్యారని, వారు చేసిన పనులు కలకాలం గుర్తుండిపోతాయని అన్నారు. ప్రభుత్వ పక్షాన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పక్షాన, స్థానిక శాసనసభ్యునిగా తన పక్షాన వనజీవి రామయ్య ఆత్మ శాంతించాలని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మనిషి జీవించినంత కాలం చేసిన మంచి పనులే వారిని చిరస్మరణీయులని చేస్తాయని మంత్రి తెలిపారు. వనజీవి రామయ్య చేపట్టిన కార్యక్రమాలు యావత్తు దేశ ప్రజలు గౌరవించే విధంగా చేశాయన్నారు. వనజీవి రామయ్యకు చిరకాల కోరికలు ఉన్నాయని కుటుంబ సభ్యులు తెలిపారని, వాటన్నిటినీ సాధ్యాసాధ్యాలు పరిశీలించి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మాట్లాడి, వాటన్నిటిని నెరవేర్చడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, రూరల్ తహసిల్దార్ రాం ప్రసాద్ పాల్గొన్నారు.



### కోటి మొక్కలకు పైగా నాటారు..

**వనజీవి రామయ్య చెట్లను పెంచే కార్యక్రమాన్ని జీవిత కాలమంతా చేశారని, ఎన్ని ఇబ్బందులు వచ్చిన, ఎన్ని కష్టాలు ఎదురైనా, ఆర్థికంగా ఎన్ని ఒడిదుడుకులు ఎదుర్కొన్న, వాటన్నిటినీ అధిగమించి, కోటి మొక్కలకు పైగా నాటారని అన్నారు. వేలాది కోట్ల విత్తనాలను, వందలాది ఎకరాల్లో జీవం పోశారన్నారు. పచ్చదనాన్ని పెంచడానికి, ఆర్థిక పరిస్థితులు సహకరించకపోయిన, ఒక పూట తిన్నా, తినకపోయిన మొక్కలు పెంచాలని, మొక్కలతో వచ్చే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తూ, వారి గ్రామంలోనే కాకుండా చుట్టుపక్కల అటవీ భూములు, ప్రభుత్వ భూములు, ఎక్కడైతే మొక్కను నాటోచ్చో, ఆ ప్రాంతాల్లో మొక్కలు నాటి, ప్రాంతాన్ని అద్భుతంగా పచ్చదనం చేశారని, పద్మశ్రీ అవార్డు అందుకున్నారని మంత్రి తెలిపారు.**

# పుష్పాల ఇందిరమ్మకు నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే



**కారేపల్లి, మహా:** కారేపల్లి మండలంలో ఎస్.ఐ గా విధులు నిర్వహించిన పుష్పాల రామారావు తల్లి గత ఏడాది మృతి చెందారు. ఆదివారం ఎస్.ఐ నివాసం ములకలపల్లి లో మృతురాలు ఇందిరమ్మ సంవత్సరికం సందర్భంగా వైరా నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు లావుడియా రాములు నాయక్ ఇందిరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్.ఐ రామారావును మనోధైర్యం కల్పించారు.

# రజతోత్సవ సభను విజయవంతం చేయండి



**ఏన్కూరు - మహా:** ఏన్కూరు మండల ప్రధాన సెంటర్ నందు బీఆర్ఎస్ పార్టీ కేటీఆర్ యువసేన మండల కమిటీ సభ్యులు ప్రెస్ మీట్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ప్రెస్ మీట్ లో కేటీఆర్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈనెల ఏప్రిల్ 27న ఆదివారం నాడు వరంగల్ జిల్లా, ఎల్కతుర్తి లో జరుగు బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, పార్టీ సానుభూతిపరులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ సభను విజయవంతం చేయగలరని కేటీఆర్ యువసేన మండల కమిటీ సభ్యులు కోరారు. బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధి కోసం కేటీఆర్ యువసేన మండల కమిటీ ఎల్లప్పుడూ పనిచేస్తూ ఉంటుందని, మా కేటీఆర్ యువసేన మండల కమిటీ వ్యక్తిగతంగా ఎవరికి వ్యతిరేకం కాదని పార్టీ అభివృద్ధి లక్ష్యంగా, కేసీఆర్ గారి నాయకత్వమే ధ్యేయంగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు భుక్యా వినోద్ కుమార్, భూక్య ధర్మానాయక్, గిరిజన మండల నాయకులు గుగులోత్ ఈశ్వర్ నాయక్, ముస్లిం మైనారిటీ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, యూత్ ప్రెసిడెంట్ షేక్ బాజీ, వీరభద్రం, గుగులోత్ మజీలాల్, యాకుబ్ పాషా, శ్రీకాంత్, బానోత్ వినోద్, కాకటి దావీదు, గొల్లపూడి శివకృష్ణ, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ముంపు గ్రామాలను విస్మరిస్తున్న ప్రభుత్వం



**చర్ల, మహా:** మండలంలోని కేశవాపురం గ్రామంలో వెంటనే రహదారి నిర్మాణం చేపట్టాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలో ఉన్న సమస్యలపై అధ్యయనం చేసేందుకు వచ్చిన సిపిఎం బృందానికి ఆ గ్రామ మహిళలు తమ గ్రామంలో ఎన్నో దశాబ్దాలుగా అంతర్గత రోడ్డు అస్తవ్యస్తం గా ఉండడం వలన వర్షాకాలం లో నానా అవస్థలు పడాల్సి వస్తుందని గ్రామస్తులు తెలిపారు. అదేవిధంగా గ్రామంలో చాలా మందికి రేషన్ కార్డులు లేవని, వృద్ధాప్య, వితంతు వికలాంగు పింఛన్లు రాక ప్రజలు చాలా నానా అవస్థలు పడుతున్నారని గ్రామస్తులు మొరపెట్టుకున్నారు. అనంతరం మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ముంపు ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు మండల కేంద్రంలో గల నాయక్ కాలనీ గుట్టలపై ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.మండల వ్యాప్తంగా ఉన్న అంతర్గత రోడ్ల సమస్యలు, ప్రధాన రహదారుల సమస్యలు, మహిళకు మహాలక్ష్మి పథకం కింద ఇచ్చే జీవన భృతి, నూరు శాతం రైతుబంధు, రుణమాఫీ చేయాలని అలా చేయని ఎడల భారీగా జన సమీకరణ చేపట్టి ఈనెల 21వ తేదీన మండల కేంద్రంలో నిరసన ర్యాలీ ధర్నా లు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. నర్సారెడ్డి, కె బ్రహ్మచారి, రేపాకుల శ్రీనివాస్, మండల కార్యదర్శి మచ్చా రామారావు మండల కమిటీ సభ్యులు పొడుపుకంటి సమ్మక్క ,దొడ్డి హరినాగ వర్మ పామారు బాలాజీ, నాయకులు సాంబ, పోశాలు గ్రామస్తులు గాంధెమ్మ, తుర్రం సరోజన ,కృష్ణవేణి తుర్రం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**బోనకల్, మహా :** ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రఘురాం రెడ్డి సిఫారసు మేరకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మండల పరిధిలోని తూటికుంట్ల గ్రామంలో ఆదివారం టెలికం అడ్వైజరీ కమిటీ మెంబర్ ఉమ్మినేని కృష్ణ, మండల ముఖ్య నాయకులు భాగం నాగేశ్వరరావు,తోటకూర వెంకటేశ్వరరావు,బోయినపల్లి మురళీ బోనకల్ గ్రామానికి చెందిన మరీదు మౌనికకు రూ. 25000, గోవిందాపురం (ఎల్ )గ్రామానికి చెందిన రాచబంటి బ్రహ్మంకు రూ. 20000, ముష్టికుంట గ్రామానికి చెందిన దొడ్డ వెంకటేశ్వర్లు కు రూ. 32,500 మంజూరు కాగా వారికి నాయకుల చేతుల మీదుగా చెక్కులను అందజేశారు,ఈ కార్యక్రమంలో చింతలచెరువు లక్ష్మీనారాయణ,ఊటుకూరి బాలకృష్ణ, చిలక శివ,కొల్లి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



మహా పత్రిక
ANN తెలుగు

## యేసుక్రీస్తు మార్గమే మానవాళికి ఆదర్శం



**బోనకల్, మహా:** దేవుని ఉగ్రతను తప్పించడం కోసం మానవాళికి శాంతి సమాధానం ఇవ్వటం కోసం ఏసుక్రీస్తు సాత్విక మనస్సు కలిగి తగ్గింపు స్వభావంతో గుర్రమును కాకుండా గాడిదను ఎంచుకొని కులాలకు మతాలకు తావు లేకుండా మానవత్వాన్ని మంచిని మానవులకు తెలియజేసిన ప్రశస్తమైన రోజు ఈ మట్టల ఆదివారం అని పాస్టర్ సదానంద్ పాల్ అన్నారు ఆదివారం తెలుగు బాప్టిస్ట్ చర్చి కలకోటలో నిర్వహించిన శాంతి ర్యాలీలో ఆయన పాల్గొన్నారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు జీవితమే ఈ మానవాళికి ఆదర్శనీయమన్నారు,ఈ కార్యక్రమంలో దైవజనురాలు కత్తి జైపాల్,అనూష పాల్, సంఘ పెద్దలు యంగల జీవరత్నం,తోటపల్లి సాల్మన్, యంగల అమరయ్య సంఘస్తులు పిల్లలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



**నేలకొండపల్లి, ఏప్రిల్ 13 మహా:** రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ముదిగొండ మండలం లోని పండ్రేగిపల్లి గ్రామం కు చెందిన షేక్ సోహెల్ (25) అనే యువకుడు సూర్యాపేట జిల్లా లోని మఠంపల్లి లో బంధువుల ఇంటికి బైక్ పై వెళ్తున్నాడు. ఆదివారం తెల్లవారు జామున నేలకొండపల్లి మండల కేంద్రం లోని ప్రభుత్వ కాలేజీ సమీపం లోకి రాగానే జాతీయ రహదారి పై మరమ్మతుల కోసం ఆగి ఉన్న ట్రాక్టర్ ను డీకొట్టింది. దీంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడు సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహం కు స్థానిక ప్రభుత్వ హస్పిటల్ లో పోస్టుమార్టమ్ నిర్వహించారు. కాగా ట్రాక్టర్ యాజమాని పై కేసు నమోదు చేశారు.

## ఉప్పలమ్మ వేడుకలో పాల్గొన్న రాయల, దుర్గాప్రసాద్



**నేలకొండపల్లి, ఏపీ 13 మహా:** కాంగ్రెస్ సేవాదళ్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం నిర్వహించిన ఉప్పలమ్మ వేడుక కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ లు పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి శివ, డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య. నేలకొండపల్లి సొసైటీ చైర్మన్ కోటి సైదారెడ్డి. మైనార్టీ నాయకులు షేక్ హుస్సేన్, కాంగ్రెస్ నాయకులు జెర్రిపోతులు అంజిని, భద్రయ్య, గట్టిగుండ్ల విజయ్, జెర్రిపోతుల సత్యనారాయణ. కడియాల నరేష్, సాయి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## 143 మంది రోగులకు వైద్య సేవలు



**నేలకొండపల్లి, ఏప్రిల్ 13 మహా:** సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు అమరజీవి నూతక్కి గంగాధరరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయంలో జరిగిన 28వ నెల నెలా వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ వైద్య శిబిరంలో 143మంది రోగులకు డాక్టర్లు వైద్య సేవలు అందించారు. వైద్య శిబిరంలో షుగర్, బీపీతో పాటు ఇతర సాధారణ జబ్బులకు డాక్టర్లు పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. బీపీ షుగర్ వ్యాధులకు నెలకు సరిపడా మందులను కేవలం 100 రూపాయలకే అందించారు. ఏటుకూరి రామారావు మాట్లాడుతూ వైద్య శిబిరానికి ప్రతి నెల ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్జీఆర్ ఫౌండేషన్ కార్యదర్శి కే వీ రెడ్డి, సభ్యులు కొంగర నారాయణరావు,ఎస్.కె జమాల్ పాషా, మరియు వాలంటీర్ సేవలు అందించినవారు వల్లంచెట్ల భాస్కరరావు,మంకెనపల్లి నరసింహారావు, ఏలూరి కోదండ రామారావు , సామాల మల్లికార్జున్, బొడ్డు బాబురావు, డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



# కలంతో కలసిన కలం

## మారెడ్డి జర్నలిజం మహోన్నత ఋజువు

## విలువలకు వెన్నెముకగా నిలిచిన మారెడ్డి నాగేందర్ రెడ్డి

### ఉత్తమ జర్నలిస్టు పురస్కారం ద్వారా ప్రజా స్వరానికి గౌరవం

**ఖమ్మం - మహా:** సమాజ స్పందనలతో నిండిన, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించే కలం ఒకటి ఉంటే, అది మారెడ్డి నాగేందర్ రెడ్డి దే. సంప్రదాయ విలువలకు, ప్రజాస్వామ్య సూత్రాలకు బలమైన పునాది వేసే విలేఖనం నిబద్ధత, నీతి, నిర్భయత్వంతో సాగాలి. ఇటువంటి అరుదైన విలువలకు ప్రతీకగా మారెడ్డి జీవనయానం నిలుస్తుంది. ఇటీవల ఆయనకు లభించిన "ఉత్తమ జర్నలిస్టు" పురస్కారం విలువల జర్నలిజానికి అంకితమైన గౌరవంగా పరిగణించబడుతోంది.

#### ఉన్నత గౌరవంతో అభిషేకం

సుప్రీంకోర్టు 48 వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని స్వీకరించడం ఈ ఘట్టాన్ని మరింత గౌరవప్రదంగా చేసింది. ఉగాది పురస్కారాల వేదికపై జరిగిన ఈ సంబరంలో మారెడ్డి జర్నలిస్టుల గౌరవాన్ని సమాజం ముందు ఉన్నతంగా నిలిపిన ఘనతను అందుకున్నారు.

#### మూడున్నర దశాబ్దాల అక్షర యాత్ర

మారెడ్డి జర్నలిస్టిక్ ప్రస్థానం ఒక సమగ్ర పాఠ్యం వంటిది. ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాలను తన కార్యక్షేత్రంగా మలచుకున్న ఆయన, స్థానిక ప్రజల హక్కుల కోసం కలాన్ని శక్తివంతమైన ఆయుధంగా మార్చారు. వ్యవస్థల దుర్వినియోగంపై ఆయన రాసిన విశ్లేషణాత్మక కథనాలు ప్రభుత్వాలకు అద్దం పట్టాయి.

#### సమాజానికి ధైర్యాన్నిచ్చిన కలం

రైతుల సంక్షోభం, విద్యార్థుల ఆవేదన, పాలనా వైఫల్యాలపై ఆయన కలం వెలిగించిన వెలుగు ప్రజలకు ధైర్యాన్ని, పాలకులకు బాధ్యతను గుర్తు చేసింది.

#### విలువలతో మార్మోగే గొంతు

మారెడ్డి కలం కేవలం కలం కాదు అది ప్రజల గుండె చప్పుడై, సమాజ ఆకాంక్షలకు గొంతుగా మారింది. నిజాయితీకి ధర నిర్ణయించే, సంచలనాలకే పరిమితమైన ఈ యుగంలో, విలువలకు వెన్నెముకగా నిలిచి, రాజకీయ ఒత్తిళ్లను ధిక్కరించి, పక్షపాతం లేకుండా ప్రజల పక్షాన నిలబడగలిగిన జర్నలిస్టులు విరలం. మారెడ్డి గారు అటువంటి అరుదైన రత్నం.

#### విలువల జర్నలిజానికి పట్టాభిషేకం

ఈ "ఉత్తమ జర్నలిస్టు" పురస్కారం కేవలం వ్యక్తిగత గౌరవం కాదు విలువల పక్షంలో నిలిచే ప్రతి జర్నలిస్టు పోరాటానికి సమర్పణ. ప్రజల గొంతును కలంగా మలిచిన వారికి లభించే నీరాజనం. అవార్డు స్వీకరిస్తూ మారెడ్డి గారు చెప్పిన మాటలు జర్నలిస్టులం దరికీ ఆలోచనా గీతంగా నిలిచాయి.



#### నేటి తరానికి ఆదర్శ దీపం

సంచలనాలకు కట్టుబడి, విలువలను విస్మరిస్తున్న నేటి మీడియా లోకంలో, మారెడ్డి గారి జీవితం విలువల జర్నలిజానికి జీవస్వరంగా నిలుస్తుంది. ఆయన కథనాలు పాఠకుల మనసులో ప్రశ్నలు రగిలించే ఉద్యమ గీతాలు. ఆయన స్వరం దోపిడీపై ఆవేదనతో కూడిన ధ్వని. ఆయన జీవనం ప్రజాస్వామ్య ధర్మానికి దీపస్తంభం.

#### ప్రజల శ్వాసైన కలం

విలేఖనం నిస్సహాయుల ఆక్రందనగా ఉండాలి. మారెడ్డి గారు ఆ సత్యాన్ని జీవించినవారు. ఆయన కథనాల్లో ప్రజలు, సమస్యల్లో సమాజం, శీర్షికల్లో మార్పు ఆకాంక్ష కనిపిస్తాయి. కలాన్ని పదునైన ఆయుధంగా మలిచి, శబ్దాన్ని సమాజ పురోగతికి మార్గంగా చేసిన మారెడ్డి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తారు.

#### మానవత్వంతో కలిసిన కలానికి నీరాజనం

ఈ పురస్కారం మారెడ్డి కే కాదు విలువల జర్నలిజానికి, బాధ్యతతో కూడిన విలేఖనానికి, ప్రజల పక్షాన నిలిచే ధైర్య స్వరానికి. కలం మానవత్వంతో కలిసినప్పుడు పొందే మహత్తర గౌరవానికి ఇది నిదర్శనం.

FOLLOW: @ANNTELUGU
14-4-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు



# బాబాసాహెబ్ ఆశయాలే బిజెపి ధ్యేయం

- కాంగ్రెస్ ప్రభుత్వంలో అంబేద్కర్‌కు అవమానం
- పార్లమెంట్లో కనీసం చిత్రపటం పెట్టని వైనం
- బడుగు బలహీనవర్గాల పక్షపాతి కేంద్ర ప్రభుత్వం
- పార్టీ సంస్థాగత నిర్మాణానికి సైనికుడిలా పని చేస్తా
- బిజెపి జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి
- పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన బిజెపి శ్రేణులు

**ఖమ్మం - మహా:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం దేశ ప్రజాస్వామ్య చరిత్రలో అద్భుతమైన మార్గదర్శక గ్రంథంగా నిలిచింది. బడుగు, బలహీన, అనాధ్రిత వర్గాలకు న్యాయబద్ధమైన స్థానం కల్పించడంలో అంబేద్కర్ అచంచలంగా పోరాడిన తీరును ప్రతి రాజకీయ పార్టీ అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉన్నదని బిజెపి జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి వ్యాఖ్యానించారు. అయితే అంబేద్కర్ ఆశయాలను నిజంగా కొనసాగిస్తూ, భారత రాజ్యాంగాన్ని కచ్చితంగా అమలు చేస్తున్న ఏకైక పార్టీగా భారతీయ జనతా పార్టీ అని అభివర్ణించారు. ఆదివారం

ఖమ్మం నగరంలోని జడ్పీ సెంటర్ వద్ద అంబేద్కర్ జయంతి వేడుకల్లో భాగంగా స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు తో కలిసి మీడియాతో మాట్లాడారు .రాజ్యాంగ మార్గంలో సాగాలనుకునే వారి పక్షాన బిజెపి నిలుస్తుందని, కాంగ్రెస్ పాలనలో అంబేద్కర్ కు అవమానాలు తప్పలేదని పేర్కొన్నారు.

"బాబా సాహెబ్ అంబేద్కర్ నిర్మించిన భారత రాజ్యాంగమే బిజెపి అజెండా. ఆయనే మాకు మార్గదర్శి. ఆయన ఆశయాల సాధనే మాకున్న ధ్యేయం," అని చెప్పిన ఆయన, కాంగ్రెస్ పార్టీ పాలనను తీవ్రంగా విమర్శించారు. గతంలో అంబేద్కర్ కు ఉచిత స్మారక స్థూపం నిర్మించని కాంగ్రెస్ పార్టీ, పార్లమెంటు ప్రాంగణంలో ఆయన చిత్రపటాన్ని కూడా పెట్టకపోవడం ఆ పార్టీ దళిత వ్యతిరేక వైఖరిని వెలుగులోకి తెస్తుందని పేర్కొన్నారు. అంతేకాదు, దేశ చరిత్రలోనే తొలిసారిగా అనేక రాష్ట్రాల గవర్నర్లుగా దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలకు చెందిన నాయకులను నియమించగలిగింది బిజెపి ప్రభుత్వమేనని గర్వంగా తెలిపారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి, బడుగు ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని వివరించారు. "కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైంది. ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అందుకే కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో విశ్వాసం పెరిగింది. బిజెపి వైపు వారు ఆకర్షితులవుతున్నారు," అని వ్యాఖ్యానించారు.

## సామాజిక సమానత్వానికి బిజెపి తపన

అంబేద్కర్ ఆశయాల్లోని సామాజిక సమానత్వం, హక్కుల పరిరక్షణ, వర్ణవ్యవస్థ వ్యతిరేకత వంటి అంశాలను బిజెపి నిజంగా అమలు చేస్తోందని పేర్కొంటూ, దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, అవకాశాల సమానత కల్పించేందుకు బిజెపి ప్రభుత్వం పాటుపడుతోందని వివరించారు. ఒకవైపు అంబేద్కర్ విగ్రహాల వద్ద నివాళులర్పిస్తూ, మరోవైపు ఆచరణాత్మక చర్యలతో రాజ్యాంగ విలువలను అమలు చేయడం ద్వారా బిజెపి అంబేద్కర్ జయంతిని ఉత్సవంగా మార్చిందని కొనియాడారు.

## సైనికుల్లా పార్టీకి పని చేయాలన్న పిలుపు

పార్టీ నిర్మాణానికి కార్యకర్తలతో కలిసి తాను సైనికుడిలా పని చేస్తానని తెలిపారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తల అంకితభావం అవసరమని, ఈ నెల 24 వరకు అంబేద్కర్ జయంతి ఉత్సవాలను గ్రామీణ, పట్టణ స్థాయిల్లో ఘనంగా నిర్వహించాలని కోరారు. ఖమ్మంలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించిన అనంతరం అక్కడే స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ నాయకులు, పార్లమెంటరీ కోఆర్డినేటర్ నంబూరి రామలింగేశ్వర రావు, గోంగూర వెంకటేశ్వర్లు, సన్నె ఉదయ్ ప్రతాప్, దేవకీ వాసుదేవరావు, ఈవీ రమేష్, నున్నా రవికుమార్, దొంగల సత్యనారాయణ, కోటమర్తి సుదర్శన్, నల్లగట్టు ప్రవీణ్ కుమార్, నీరు కొండ ఉషారాణి, రేఖా సత్యనారాయణ, మాడుగుల చిన్నికృష్ణ పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

- వరదలతో దెబ్బతిన్న కాలువల మరమ్మత్తులు
- వేసవి ముగిసేలోగా కాలువ పూడికతీత
- కాలువలు ఆధునికరణ చేపట్టాలి భూములకు అందించేలా చర్యలు
- ప్రతి ఎకరాకు సాగునీరే సీఎం రేవంత్ లక్ష్యం....
- వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల



**ఖమ్మం - మహా:** రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ సర్కారు పనిచేస్తుందని, రైతు అభ్యున్నతికి కట్టుబడి ఉన్నామని వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నాగార్జునసాగర్ కెనాల్ ఆధునికరణ, మరమ్మత్తులు, తదితర అంశాలపై సూర్యాపేట ఖమ్మం సి రమేష్ బాబు తో మంత్రి తుమ్మల మాట్లాడారు. గత ఆగస్టు నెలలో వచ్చిన అకాల వర్షాలు వరదలకు కాలవలు పూర్తిగా దెబ్బతిన్నాయని, మే నెల ఆఖరి వరకు కాలువల ఆధునికరణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. చివరి ఆయకట్టు భూములకు సైతం నీరందించేలా పటిష్ట ప్రణాళికలతో నాణ్యత ప్రమాణాలు పాటించేలా మరమ్మత్తులు ఆధునికరణ చేయాలని సూచించారు. అకాల వర్షాలు వరదల వల్ల తీవ్ర నష్టం వాటిల్లిందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. క్షేత్రస్థాయి కాలువలను పరిశీలించాలని ఆదేశించారు. అవసరమైన అన్నిచోట్ల మరమ్మత్తులు, ఆధునికరణ, కాలువ కట్టల బలోపేతం, బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలన్నారు.

## రైతు ప్రయోజనాలకు పెద్దపీట...

గత ఏడాది వచ్చిన అకాల వర్షాలు వరదలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అనేక కాలువలు చెరువుల గండ్లు దెబ్బతిన్నాయన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ముందస్తు ప్రణాళికలలో భాగంగా ఆయా కాలువల మరమ్మత్తులు చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఖమ్మం జిల్లాలో ప్రధాన వనరుగా ఉన్న ఎన్ఎస్పి కాలువల ద్వారా చివరి భూములకు నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ప్రణాళిక బద్ధంగా ప్రభుత్వం సాగునీటిని విడుదల చేస్తుందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా నీటిని విడుదల చేసేందుకు అధికార యంత్రాంగం యుద్ధప్రాతిపదికన పలుగుల మరమ్మత్తులు ఆధునికరణ చేయాలన్నారు. రైతు ప్రయోజనమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.

## ప్రతి ఎకరాకు సాగునీరు లక్ష్యం....

తెలంగాణను పచ్చని పంట పొలాలతో సస్యశ్యామలంగా నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. బీడు భూముల లేని తెలంగాణగా మార్చేందుకు అనునిత్యం శ్రమిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. చివరి ఆయకట్టు భూములకు సైతం సకాలంలో నీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి ఉన్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ చివరి ఎకరాకు నీరు అందించేలా పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని వెల్లడించారు.

### దేశానికే తలమానికంగా తెలంగాణ

తెలంగాణ రాష్ట్రం దేశానికే తలమానికంగా నిలుస్తుందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. తెలంగాణ పంట ఉత్పత్తులలో ధాన్యాగారంగా నిలుస్తుందని వెల్లడించారు. దేశానికి అన్నం పెట్టే అన్నదాతలకు నెలవుగా తెలంగాణ రాష్ట్రం నిలుస్తుందని పేర్కొన్నారు. రైతు ఇంట సిరులు కురిపించేలా ప్రభుత్వం అన్నదాతల సంక్షేమానికి బాటలు వేస్తుందన్నారు.

### నాణ్యతలో రాజీలేదు....

నాణ్యత పనుల్లో ఎక్కడ రాజీ పడకుండా పనిచేయాలని మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు. సరైన సమయంలో నాణ్యత ప్రమాణాలతో పనులు సజావుగా చేపట్టాలన్నారు. ఇది నిర్వహణలో అలసత్వం లేకుండా సమన్వయంతో పనిచేసి మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకోవాలన్నారు. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ సర్కారు పనిచేస్తుందన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతాంగానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రైతులు సంతోషంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు.



# పలు కార్యక్రమాలకు హాజరైనఎమ్మెల్యే పాయం

**మణుగూరు, మహా:** పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మణుగూరు,పినపాక మండలాల్లో పలు శుభ కార్యక్రమాలకు హాజరయ్యారు. మణుగూరు గోల్డెన్ ఫంక్షన్ హాలులో జరిగిన ఓణీల వేడుకకు, పినపాక మండలం జానంపేటలో జరిగిన వివాహ వేడుకలకు వెళ్లి వారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# రావినూతలలో గావ్ ఛలో... బస్తీ ఛలో



**బోనకల్, మహా:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షులు కేంద్ర మంత్రివర్యులు గంగాపురం కిషన్ రెడ్డి పిలుపుమేరకు మండలం రావినూతల గ్రామంలో గావ్ చలో– బస్తీ చలో కార్యక్రమంను బిజెపి మండల అధ్యక్షురాలు తాళ్లూరి మౌనిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు గల్లా సత్యనారాయణ హాజరయ్యారు, సోమవారం బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా రావినూతల గ్రామంలోని బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని శుభ్రంగా కడిగి శుద్ధి చేయడంతో పాటు విగ్రహం చుట్టూ ఉన్న చెత్తను ఊడ్చి శుభ్రం చేశారు,అనంతరం మాట్లాడుతూ అదేవిధంగా బాబా సాహెబ్ అంబేద్కర్ బడుగు బలహీన వర్గాల కోసం ఎనలేని కృషి చేసిన మహానుభావులనీ అటువంటి మహనీయుడిని కాంగ్రెస్ కమ్యూనిస్టు పార్టీలు కలిపి ముంబైలో జరిగినటువంటి ప్రత్యక్ష ఎన్నికలలో బాబా సాహెబ్ అంబేద్కర్ ని ఓడించడం జరిగిందనీ అన్నారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం నరేంద్ర మోడీ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తూనే ఉంటుందని అన్నారు.

మహా పత్రిక
ANN తెలుగు





# మధిరకు మహార్దశ

**మధిర, ఏప్రిల్ 13 మహా:** రూ.128 కోట్లతో పట్టణానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మిస్తున్నామని మధిర రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం మధిర మండలంలో పర్యటించి పలు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు టి.యు.ఎఫ్.ఐ.డి.సి. నిధులు 128 కోట్ల అంచనా వ్యయంతో మధిర మున్సిపాలిటీ అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి నిర్మాణ పనులకు, వంగవీడు గ్రామంలో వంగవీడు నుండి నక్కలగరుబు వరకు 5 కోట్ల 25 లక్షలతో చేపట్టిన బి.టి.రోడ్డు నిర్మాణ పనులకు, కృష్ణాపురం గ్రామంలో కృష్ణాపురం నుండి భగవాన్లపురం వరకు 3 కోట్లతో చేపట్టిన బి.టి.రోడ్డు నిర్మాణ పనులకు, ఆత్కూరు గ్రామంలో ఆత్కూరు ఆర్ అండ్ బి రోడ్డు నుండి ముస్లిం కాలని వయా పిల్లిగుట్ట వరకు 4 కోట్ల 50 లక్షలతో చేపట్టిన బి.టి.రోడ్డు నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధిర పట్టణంలో ప్రజలకు మెరుగైన మౌళిక వసతులకు కల్పనకు ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. మధిర పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ప్రాజెక్టు నిర్మాణాన్ని 128 కోట్లతో చేపట్టామని, వీటికి తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా నిధులు సమ కురుస్తున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లో భాగంగా 99.56 కిలో మీటర్ల మేర సీవరేజ్ పైప్ లైన్, 6 వేల 638 గృహాలకు కనెక్షన్, 4 సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లను నిర్మిస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. పాత డంపింగ్ యార్డ్ వద్ద రాయ పట్నం రోడ్డులో 5 ఎం.ఎల్.డీ ఎస్.టి.పి, మడుపల్లిలో 0.9 ఎం.ఎల్.డీ ఎస్.టి.పి, మధిర లేక్ వద్ద అంబర్ పేటలో 0.4 ఎం.ఎల్.డీ ఎస్.టి.పి, ఇల్లందులపాడు సబ్ రిజిస్టర్ ఆఫీస్ వద్ద 0.5 ఎం.ఎల్.డీ ఎస్.టి.పి నిర్మించడం జరుగుతుందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. మధిర పట్టణంలో మేజర్ స్టార్మ్ వాటర్ డ్రైన్, ఆర్.సి.సి రిటైనింగ్ వాల్, ఓ.సి. ఈ.ఎం.ఎస్ పరికరాల అమరిక పూర్తి చేస్తామని, ఈ పనులను రెండు సంవత్సరాల సమయంలో పూర్తి చేయడం జరుగుతుందని, పనులు పూర్తి చేసిన తర్వాత నిర్మాణ సంస్థ 5 సంవత్సరాల పాటు నిర్వహణ చేయాల్సి ఉంటుందని, మధిర పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు నాణ్యతతో చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణ పనులను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, నాణ్యత ప్రమాణాలకు ఎక్కడ రాజీ లేకుండా చూడాలని అన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం వల్ల పట్టణ వాసుల ఆరోగ్యం మెరుగుపడుతుందని, సీజనల్ వ్యాధుల వ్యాప్తి తగ్గిపోతుందని, పట్టణంలో పారిశుధ్యం , గ్రీనరీ పెరిగేందుకు దోహదం అవుతుందని అన్నారు. మధిర పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేలా అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో సైతం ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నామని, నేడు మధిర మండలంలో వివిధ గ్రామాలలో 12 కోట్ల 75 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామని వీటిని సైతం త్వరితగతిన నాణ్యతతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, అదనపు కలెక్టర్ శ్రీజా, ఆర్డీఓ నరసింహా రావు, మునిసిపల్ కమీషనర్ సంపత్, మధిర తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీఓ., ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## చిరు వ్యాపారులపై గిరి గిరి ఫైనాన్స్ దందా

## మితిమీరిన వడ్డీలతో కుదేలవుతున్న చిరు వ్యాపారులు

## వచ్చిన ఆదాయం అంతా వడ్డీలకే సరి

## అర్థరాత్రి, తెల్లవారుజామున ముక్కుపిండి వసూళ్ళు..

# పేదలపై ఆంధ్రాగిరి గిరి

నిరుపేదల జీవితాలపై "ఆంధ్రాగిరి"గిరి నడుస్తోంది.. పేదల అవసరాలను ఆసరాగా చేసుకుని ఆంధ్రా గిరులు అడ్డగోలు వ్యాపారాలు చేస్తున్నారు.. అధిక వడ్డీలతో గిరిగిరి, ఫైనాన్స్ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.. పేదల అవసరాలను అడ్డుగా చేసుకుని ఫైనాన్స్ రూపంలో అధిక వడ్డీలతో పేదలకు ఇస్తూ ముక్కుపిండి వసూళ్ళు చేస్తున్నారు.. ఇలాంటివి నడిపించాలంటే ప్రభుత్వ అనుమతులు ఉండాల్సి ఉండగా అంతా మా ఇష్టం అంటూ ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా వ్యాపారం చేస్తున్నారు.. అర్ధరాత్రులు, వేకువ జామున గ్రామాల్లో తిరుగుతూ కోడికూత రూపంలో ఫైనాన్స్ అంటూ పేదలను నిద్రలేపి మరి వసూళ్ళు చేస్తున్నారు.. ఫలితంగా నిరుపేదలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. నిరుపేదలు పై "ఆంధ్రాగిరి" భారంపై **మహా ప్రత్యేక కథనం..**

**మహా-కూసుమంచి:** కూసుమంచి మండలంలో పేదలు, చిరు వ్యాపారులు గిరిగిరి, ఫైనాన్స్ కోరల్లో చిక్కుకొని విలవిలలాడుతున్నారు. వడ్డీ వ్యాపారుల ఆగడాలకు తీవ్రంగా నష్టపోతున్నారు. రిజిస్ట్రేషన్ లేని ఫైనాన్స్‌లతో పాటు అక్రమ చిట్టి వ్యాపారులు మితిమీరిన వడ్డీ వసూలు చేస్తూ వ్యాపారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. వ్యాపారాలు అభివృద్ధి చేసుకోవాలనే తపనతో ఎవరికి వారే సొమ్ములు పొందుతున్నా, అధిక వడ్డీతో పాటు చెల్లింపుల్లో చిన్న లోపం వచ్చినా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వడ్డీ వ్యాపారల వద్ద రోజువారీ ఫైనాన్స్ తీసుకోవాల్సిన పరిస్థితుల్లో, ఒక్క రోజు కిస్తీ ఆలస్యం అయితే వడ్డీకి వడ్డీ వేస్తూ రెండింతలు డబ్బులు వసూలు చేస్తున్నారని చిరు వ్యాపారులు వాపోతున్నారు. మార్కెట్‌లో పెరిగిన పోటీ, కుటుంబ అవసరాల నిమిత్తం పనిచేస్తూ వడ్డీ కట్టడం మరింత కష్టంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీటి వ్యాపారుల అక్రమ కార్యకలాపాలు కూడా వ్యాపారులకు తలనొప్పిగా మారాయి. చీటి డబ్బులు సమయానికి ఇవ్వక, డైలీ ఫైనాన్స్‌ల కోసం డబ్బులు నిలిపి వేస్తున్నారని బాధితులు చెబుతున్నారు. కొంతమంది పోలీసు అధికారులు గతంలో చర్యలు తీసుకున్నారు. కానీ ప్రస్తుతం దృష్టి సారించకపోవడంతో ఈ వీరి ఆగడాలు మరింత పెరిగిపోతున్నాయి.

## ప్రభుత్వ అనుమతులు లేకుండానే..

గ్రామాల్లో ఫైనాన్స్ కానీ, గిరి గిరి నడిపించాలంటే కచ్చితంగా ప్రభుత్వ అనుమతులు ఉండాలి.. కానీ చాలా మంది ఆంధ్ర వాళ్ళు, స్థానిక కొంత మంది ఫైనాన్స్ కల్గిన వ్యక్తులు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా గిరిగిరి, ఫైనాన్స్ లు నడిపిస్తున్నారు. టూ విలర్స్ పై గ్రామాల్లో తిరుగుతూ ఫైనాన్స్ ఇస్తూ ముక్కుపిండి వసూళ్ళు చేస్తున్నారు. తద్వారా అమాయక ప్రజలు అవసరాలకు తీసుకుని, కట్టలేక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ అధికారులు, స్థానిక పోలీసులను అప్రమత్తం చేసి, రిజిస్ట్రేషన్ లేని ఫైనాన్స్‌లను, అక్రమ చిట్టి వ్యాపారాలను నిరోధించి తమ జీవితాలలో వెలుగు నింపాలని చిరు వ్యాపారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల సంక్షేమానికి ఈ వ్యాపారాల నియంత్రణ తక్షణం అవసరమని పట్టణ ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

## పల్లెల్లో ఆంధ్రా గిరి

కూసుమంచి మండలంలో ఆంధ్రాగిరి అధికమైంది.. పక్కా రాష్ట్రం నుంచి వందలాది మంది పల్లెలకు వచ్చి ఫైనాన్స్, గిరి గిరి రూపంలో అధిక వడ్డీలకు ఫైనాన్స్ నడిపిస్తున్నారు. సోమవారం, మంగళవారం, బుధవారం అంటూ ఒక్కొక్క ఊరిలో ఒక్కొక్క రోజు చొప్పున వారాల చిట్టిలు, గిరిగిరిలు, ఫైనాన్స్ ఇస్తూ నిరుపేదలపై ఆంధ్రాగిరి చేస్తున్నారు. అర్థరాత్రి, తెల్లవారుజామున ఇండ్ల వద్దకు వచ్చి కోడి కూయక ముందే తలుపు తట్టి మరీ నిద్రలేపి పేదలకు ఇచ్చిన ఫైనాన్స్ డబ్బులు వసూళ్ళు చేస్తున్నారు. ఒక్క రోజు ఇవ్వకపోతే వడ్డీలకు వడ్డీ వేస్తూ ముక్కు పిండి వసూళ్ళు చేస్తున్నారని ప్రజలు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.

# ఏజెన్సీ వైద్య సేవలపై జిల్లా యంత్రాంగం స్పెషల్ ఫోకస్



**తీరిన వైద్యుల కొరత, మారుమూల ప్రాంతాలకు విస్తరించిన స్పెషాలిటీ వైద్యసేవలు...**

**పెరిగిన ప్రసవాలు మరియు ఇతర స్పెషాలిటీ సేవలు**

**తీరిన డయాలసిస్ రోగుల పాట్లు ... మందులు మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి**

**వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలో మెరుగైన సేవలు**

**అధికారుల చొరవపై హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా ప్రజలు**

**సిబ్బందిని అభినందించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 13 (మహా):** భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మరియు అధికారుల సమన్వయంతో వైద్య ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపి మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులను అప్రమత్తం చేస్తూ సూచనలు ఇస్తూ ప్రోత్సహిస్తూ జిల్లాలోని గిరిజన మరియు పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. జిల్లాలో గత సంవత్సరంలో ముఖ్య మంత్రి మరియు మంత్రులు ఆదేశాలు మేరకు వైద్యం పై శ్రద్ధ పెట్టి అధికారులు కొత్త మెరుగులు దిద్దుతున్నారు. వివరలోకి వెళ్తే.....

### తీరిన స్పెషలిస్ట్ వైద్యుల కొరత

ప్రసూతి వైద్యులు మరియు స్పెషాలిటీ వైద్యుల కొరత వేధిస్తున్న తరుణంలో అదనపు ప్రోత్సాహాలు ప్రకటించి నియమాకాలు చేపట్టారు తద్వారా మారుమూల ప్రాంతాలైన ఇల్లందు, అశ్వారావుపేట, మణుగూరు, చర్ల మరియు భద్రాచలం వంటి ఆసుపత్రులలో వివిధ నిష్ణాతులైన వైద్యులు అందుబాటులోకి వచ్చారు. గతంలో నెలకు కేవలం 150 నుండి 200 ఉన్న ప్రసవాల సంఖ్య నేడు 538 కి చేరినది, ఎక్కడికక్కడ సుఖప్రసవానికి సంబంధించిన ప్రసూతి వైద్యులు, పిల్లల వైద్యులు, మత్తు వైద్యులు, స్కానింగ్ వైద్యులు, ఆపరేషన్ కు సంబంధించిన పరికరాలు మరియు ఇతర వసతులు అన్నీ ఆసుపత్రులలో కల్పించారు.

### తీరిన డయాలసిస్ రోగుల పాట్లు

గతంలో డయాలసిస్ రోగుల వారి వైద్యం కోసం నెలలు కొద్ది వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేది. రోగి చనిపోతే తప్ప ఇతరులకు స్లాట్ దొరికే పరిస్థితి ఉండకపోయేది. అలాంటిది నేడు సుమారు 53 మిషన్లతో 248 మంది సేవలు పొందుతూ 170 ఖాళీలు ఉన్నాయి. కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు, అశ్వారావుపేట, భద్రాచలం మరియు చర్ల వంటి మారుమూల ప్రాంతంలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయడం వలన గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారం తో అతి స్వల్ప కాలంలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయడం పట్ల కిడ్నీ రోగుల పాట్లు తప్పించినట్లు అయింది. చర్ల లాంటి మారుమూల గిరిజన ప్రాంతంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడం అనేది గిరిజనులకు వైద్య సేవలు చేరువ చేయడంలో జిల్లా కలెక్టర్ మరియు స్థానిక శాసనసభ్యుల చిత్తశుద్ధికి నిదర్శనం.

### ఇల్లందులో మొదలైన ఫిజియోథెరపీ సేవలు

ఫిజియోథెరపీ చికిత్స కొరకు రోగులు తమ సొంత ఖర్చులతో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించే వారు, డాక్టర్ ఉన్నప్పటికీ పరికరాలు లేవని డిసిహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు ద్వారా తెలుసుకున్న స్థానిక శాసన సభ్యులు జిల్లా కలెక్టర్ తో మాట్లాడి జిల్లా స్థాయి నిధులు తో రెండున్నర లక్షలతో ఫిజియోథెరపీ పరికరాలు మంజూరు చేయడం జరిగింది. తద్వారా రోజుకు 15 మంది రోగులు ఫిజియోథెరపీ సేవలు పొందుతున్నారు.

### విష జ్వరాలు విజృంభిస్తున్న వేళ

విష జ్వరాలు జిల్లాలో విపరీతంగా విజృంభిస్తున్న వేళ జిల్లా కలెక్టర్ , జిల్లా మంత్రుల సమన్వయంతో మందులు మరియు రక్త పరీక్షల కొరకు కావలసిన రీ-ఏజెంట్స్ కొరకు సుమారు 90 లక్షల రూపాయలు మంజూరుచేసి మందుల కొరత తీర్చారు. తద్వారా రోగులపై ఆర్థిక భారం పడకుండా చేశారు.





### మొదలవ్వనున్న కొత్త ఆసుపత్రుల భవంతులు

ఇల్లందులో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవనం ఇటీవలే రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన కాగా త్వరలో అశ్వారావుపేట, బూర్గంపహాడ్ మరియు చర్ల ఆసుపత్రుల భవంతుల శంకుస్థాపనలు జరగనున్నాయి.

### వేసవి దృష్ట్యా రోగులకు ప్రత్యేక వసతులు

జిల్లాలో ఎండలు మండిపోతున్న వేళ రోగులకు ఇబ్బంది కలగకుండా అన్ని ఆసుపత్రిలో త్రాగునీటి కొరకు ఆర్వో వాటర్ ప్లాంట్, కూల్ వాటర్ ప్రీజ్ లు, కారిడార్లలో సరిపడా ఫ్యాన్లు, వార్డులలో కూలర్లు మరియు ఆపరేషన్ వార్డులో ఏసీలు ఏర్పాటు చేసి రోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక ప్రణాళికలతో ఏర్పాటు చేయడం

### అభినందించిన కలెక్టర్

ఎప్పటికప్పుడు సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చి ప్రణాళికా బద్ధంగా సమస్యల పరిష్కారాల కోసం కృషి చేస్తున్న జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ జి. రవిబాబు గారు, వివిధ ఆస్పత్రి సూపెరింటెండెంట్ మరియు అంకిత భావంతో మారుమూల ప్రాంతంలో పని చేస్తున్న వైద్య సిబ్బందిని జిల్లా కలెక్టర్ జితేష్ వి, పాటిల్ అభినందించారు. వైద్య సిబ్బంది మరింత బాధ్యతలతో సేవలు కొనసాగించాలని వారు కోరారు.

# ఏ దేశంలో లేని కుల వ్యవస్థ మన దేశంలోనే ఉన్నది

## భారత రాజ్యాంగం, సుప్రీంకోర్టు తీర్పు వల్లనే ఈ వర్గీకరణ సాధ్యమైనది

## వర్గీకరణకు యావత్తు సమాజం సహకారం అందించింది...

**మాకు సహకరించిన సమాజానికి ఎప్పుడూ కృతజ్ఞతగా ఉంటాం...**
**ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు, పద్మశ్రీ గ్రహీత మంద కృష్ణ మాదిగ...**



**ముదిగొండ ఏప్రిల్ 13 మహా:** ప్రపంచవ్యాప్తంగా భూమి లేని వారైనా ఉన్నారు కానీ ఏ దేశంలో లేని కుల వ్యవస్థ మనదేశంలోని ఉందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు, పద్మశ్రీ గ్రహీత శ్రీ మందకృష్ణ మాదిగ అన్నారు. మండల పరిధిలోని వల్లభి గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరణకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొదట హైదరాబాదు నుండి కోదాడ మీదుగా వల్లభి గ్రామానికి చేరుకొని ప్రధాన సెంటర్ నుండి సీతారాముల దేవస్థానంలో పూజలు నిర్వహించి కాలినడకన ర్యాలీగా అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని విగ్రహాన్ని ఆవిష్కరించి సభలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా భారతదేశంలో ముగ్గురు మహనీయులు జన్మించారని ఆ ముగ్గురు మహాత్మ జ్యోతిరావు పూలే, జగ్జీవన్ రావ్ , డాక్టర్ అంబేద్కర్ మహనీయుల కుటుంబాలకు మనమెంతో రుణపడి ఉన్నామని తెలిపారు. ఆ ముగ్గురు పుట్టకపోతే ఈ వర్గాలకు ఈమాత్రం కూడా అవకాశాలు దొరికేవి కావన్నారు. కొన్ని కులాల వారే సంపద కలిగి ఉండాలని, స్వేచ్ఛగా తిరగాలని, సేవ చేయాలని ఈ దేశ సంస్కృతిలోనే ఉందని, కానీ వేల సంవత్సరాల క్రితం పుట్టిన మనల్ని ఈనాటికి అంటరాని వారిగానే చూడటం ఈ దేశంలో మాత్రమే ఉందని ఆవేదన చెందారు. ఈ కుల వ్యవస్థలో దళిత కుటుంబాలలో పుట్టిన బలహీన వర్గాలలో పుట్టిన ఎందరో మహానుభావులు ఈ దేశంలో కుల వివక్షనకు గురవుతూనే ఉన్నారన్నారు. 30 సంవత్సరాలుగా వర్గీకరణ కోసం పోరాటం చేస్తూనే ఉన్నామని కానీ నేడు రాజ్యాంగం వల్ల సుప్రీంకోర్టు తీర్పు వల్ల వర్గీకరణ సాధించుకున్నామన్నారు. నేడు వర్గీకరణ న్యాయమైందని యావత్ సమాజమే తోడుగా నిలిచిందని వారందరికీ ఎప్పుడు కృతజ్ఞతలు తెలుపుతూ ఉంటామని తెలిపారు. వర్గీకరణ ఈ రెండు మూడు రోజుల్లోనే తెలంగాణ రాష్ట్రంలో వర్గీకరణ చట్టపరంగా అమలవుతుందని రానున్న రోజుల్లో తల్లిదండ్రులు పిల్లల చదువులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి చదివించాలని ఆ బాధ్యత సీరియస్ గా తీసుకోవాలన్నారు. ఎంత కష్టం వచ్చినా చదివే విషయంలో ఏమాత్రం తగ్గొద్దని రేపటి పిల్లల భవిష్యత్తుకు పునాది వెయ్యాలని అన్నారు. రానున్న రోజుల్లో మన పిల్లలకి మంచి భవిష్యత్తు ఇవ్వాలని కోరారు. ఎంఎస్పి, ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ సీనియర్ నాయకులు గుండెపాక నరసయ్య మాదిగ, మంద దేవేంద్ర ప్రసాద్ మాదిగ, ఏపూరి వెంకటేశ్వర్లు మాదిగ, వినసపల్లి అశోక్ మాదిగ, కూరపాటి సునీల్ మాదిగ, తూరుగంటి అంజయ్య మాదిగ, వంగూరి ఆనందరావు మాదిగ, బచ్చలకూర వెంకటేశ్వర్లు మాదిగ, నూకల నాగేశ్వరరావు మాదిగ, బొడ్డు అనిల్, పగిడి కత్తుల నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.





## ఖమ్మంలో అంబేద్కర్ విగ్రహం పరిశుభ్రత



**ఖమ్మం టౌన్, ఏప్రిల్ 13,మహా:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఖమ్మం వన్ టౌన్ ముత్యాలమ్మ సెంటర్‌లోని ఆయన విగ్రహాన్ని బీజేపీ నాయకులు ఆదివారం పరిశుభ్రం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన బీజేపీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్‌ను అవమానించిన చరిత్రను గుర్తు చేశారు. "కాంగ్రెస్ అంబేద్కర్‌ను ఎన్నికల్లో ఓడించడానికి నీచమైన పనులకు తెగబడింది. ఇప్పుడు వారు అంబేద్కర్ గురించి మాట్లాడితే ప్రజలు నమ్మరు," అని విమర్శించారు.అంబేద్కర్ ఆశయాలను బీజేపీ నెరవేర్చిందని, ఆయనకు భారతరత్న ఇవ్వడంలో కీలక పాత్ర పోషించిందని నాయకులు తెలిపారు. ప్రధాని మోదీ నేతృత్వంలో దళిత, ఆదివాసీ, మహిళా రాష్ట్రపతిని నియమించడం, బీసీ వర్గానికి చెందిన వ్యక్తిని ప్రధానిగా చేయడం, కేబినెట్‌లో 12 మంది దళితులు, 27 మంది ఓబీసీలు, 8 మంది మహిళలకు అవకాశం కల్పించడం ద్వారా అంబేద్కర్ స్ఫూర్తిని నిలబెట్టినట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో బీజేపీ ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లికా అంజయ్య, వేల్పుల సుధాకర్, మంద సరస్వతి, వీరవెల్లి రాజేష్, రిగన్ పాలెపు రాము తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీ



ఖమ్మం రూరల్, మహా. మండలంలోని వాల్యాతండాలో రైతులు పండించిన సన్న రకం ధాన్యం సేకరించేందుకు ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే అధికారులతో మాట్లాడుతూ.. కొనుగోళ్లలో జాప్యం లేకుండా సమర్ధంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, కాంగ్రెస్ ఖమ్మం రూరల్ మండల అధ్యక్షులు కళ్లెం వెంకటరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, స్థానిక నాయకులు పాపా నాయక్, జరపుల లక్ష్మణ్, ధరావత్ బాబు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికులకు బట్టలు పంపిణీ

**చర్ల,మహా:** బిఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు కుమారుడు దొడ్డి హరిసాయి, సింధుల కుమార్తె అన్విత పుట్టిన రోజు సందర్భంగా చర్ల గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న 16 మంది కార్మికులకు బట్టలను పంపిణీ చేశారు. మహిళా కార్మికులకు చీరలు మగవారికి ప్యాంటు షర్టు లను భద్రాచలం నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్ ,మానె రామకృష్ణ గార్ల చేతుల మీదుగా చర్ల బిఆర్ఎస్ పార్టీ ఆఫీసులో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందుగా వారి మనవరాలు అన్విత కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు చర్ల బిఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు పేదల కష్టాలు తెలిసిన మనిషిగా మనవరాలు పుట్టినరోజు సందర్భంగా ప్రతి సంవత్సరం కార్మికులకు బట్టలు పళ్ళు స్వీట్లు పంపిణీ చేసి వారి సేవలను గుర్తించి నందుకు అభినందనలు తెలియజేసారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల కో కన్వీనర్ అయినవోలు పవన్, బీసీ సెల్ అధ్యక్షులు గోరింట్ల వెంకటేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్, సీతాపతి సూర్యనారాయణ రాజు, అంకాల శ్రీనివాస్ ప్రమోద్ కుమార్, పంజా రాజు, తోటమల్ల రవి, తడికల బుల్లబ్బాయి,సృజన కుక్కడపు సాయి తదితరులు పాల్గొన్నారు.



## ఈదురు గాలులతో వానరాళ్ల వర్షం

**ముదిగొండ ఏప్రిల్ 13 మహా:** మండల కేంద్రమైన ముదిగొండతో పాటు మండలంలోని అయా గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో పాటు వానరాళ్ళ వర్షం పడుతుంది. మధ్యాహ్నమంతా ఉబ్బతో ఉక్కురుబుక్కున మండల ప్రజలకు ఇప్పుడు చల్లగా వర్షం పడుతుండటంతో మండల ప్రజలకు కాస్తా ఉపశమనం కలిగింది. కానీ మొక్కజొన్న, వరి ధాన్యం, మిర్చి రైతులకు నష్టమనే చెప్పాలి. మండలంలో కొనుగోలు కేంద్రంలో దాన్యం ఆరబోసిన రైతులకు ఈ వర్షంతో నష్టం కలిగే ప్రమాదం ఎక్కువగానే కనిపిస్తుంది.

## జి ఓ నెంబర్ 3 ని పునరుద్దరించాలి



**మహా భద్రాచలం:** జి ఓ నెంబర్ 3 ని పునరుద్దరించాలని ఆదివాసి అఖిలపక్ష ప్రజా సంఘాల జె ఏ సి డిమాండ్ చేసింది.ఆదివారం ఆదివాసి అఖిలపక్ష ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో తెలంగాణ ఆదివాసి సంఘాల జేఏసీ అధ్యక్షులు పాయం సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చందా లింగయ్య దొర తో పాటు సీనియర్ శాసనసభ్యులు గుమ్మడి నరసయ్య కాంగ్రెస్ పార్టీ మాజీ శాసనసభ్యులు తాటి వెంకటేశ్వర్లు వట్టం నారాయణ దొరతో పాటు పలు గిరిజన సంఘాల రాష్ట్ర అధ్యక్షులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ గురించి చర్చించి, పలు తీర్మానాలు చేశారు.ఎస్ టీ వర్గీకరణ గురించి మాట్లాడుతూ,ఏజెన్సీ ట్రైబ్స్ 1950 లో డిక్లరేషన్ చేసిన ఆదివాసి ఒక గ్రూపు కాగా,మైదాన ప్రాంత గిరిజనులు లంబాడా,ఎరుకల, యానాది తదితరులు ఒక గ్రూపు అని అన్నారు. ఎస్ టీ వర్గీకరణ, జి ఓ నెంబర్ 3 పునరుద్దరణ విషయాలపై పోరాటం చేసి సాధించుటకు రాష్ట్రస్థాయిలో ఆదివాసి అఖిలపక్ష ప్రజాసంఘాల పేరుతో ఉద్యమం నిర్వహించుటకు సమన్వ కర్తగా చందా లింగయ్య దొర కు అధికారమిస్తూ తీర్మానించారు.ఏప్రిల్ చివరి వారంలో రాష్ట్రస్థాయి మేదో మదనం జరపాలని నిర్ణయుంచారు.

## భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కు ఘన నివాళి..

**ఖమ్మం - మహా:** భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు, బలహీన వర్గాలు, సబ్బండ వర్గాల ఆశ జ్యోతి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అని, అయన ఆశయ సాధనకు బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆ పార్టీ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి ఉద్ఘటించారు. గావ్ చలో – బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఆదివారం ఖమ్మం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధి చేసి స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించిన బీజేపీ శ్రేణులు సాయంత్రం అంబేద్కర్ విగ్రహం వద్ద దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం టపాసులు కాల్చి బాబా సాహెబ్ అంబేద్కర్ కు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్లమెంటరీ కోఆర్డినేటర్ నంబూరి రామలింగేశ్వర రావు, గోంగూర వెంకటేశ్వర్లు, సన్నె ఉదయ్ ప్రతాప్, దేవకీ వాసుదేవరావు, ఈవీ రమేష్, నున్నా రవికుమార్, దొంగల సత్యనారాయణ, కోటమర్తి సుదర్శన్, నల్లగట్టు ప్రవీణ్ కుమార్, నీరుకొండ ఉషారాణి, రేఖా సత్యనారాయణ, మాడుగుల చిన్నికృష్ణ, పసుమర్తి సతీష్, కుమిలి శ్రీనివాస్, విజయ రెడ్డి, మనీ, స్వరూప, నీలిమ, మందా సరస్వతి తదితరులు పాల్గొన్నారు.





# రాజీవ్ యువ వికాసానికి నేడే ఆఖరు



**భద్రాద్రి కొత్తగూడెం ఏప్రిల్ 13 (మహా):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని యువతను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రతిష్టాత్మకంగా అమలు చేయబోతున్న రాజీవ్ యువ వికాస పథకానికి దరఖాస్తులు చేసుకునేందుకు నేడే ఆఖరు. కానీ రాజీవ్ యువ వికాస పథకానికి దరఖాస్తులు చేసుకునేందుకు ప్రభుత్వం నుండి ప్రకటన వెలువడిన నాటినుండి, నిరుద్యోగ యువత ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రధానంగా కులం, ఆదాయం తదితర సర్టిఫికెట్ల కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకొనగా, వరుస సెలవుల నేపథ్యం, ఆన్లైన్ మొరాయింపు తదితర కారణాలతో, చాలామంది అర్హులైన నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిరోజులపాటు ఆదాయ సర్టిఫికెట్ ఖచ్చితంగా పెట్టాలనే నిబంధనను మీసేవ నిర్వాహకులు చెబుతుండడంతో, ఆదాయ సర్టిఫికెట్ల కోసం వేలాదిగా దరఖాస్తులు చేసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ , మైనారిటీ వర్గాలకు చెందిన దరఖాస్తుదారులు లేటెస్ట్ కుల ధ్రువీకరణ పత్రాలు కావాలని అడుగుతున్నడంతో తహసిల్దార్ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారు. తహసిల్దార్ కార్యాలయాల్లో వేలాదిగా దరఖాస్తులు పేరుకుని పోవడంతో, అధికారుల సైతం తలలు పట్టుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా జిల్లాలో దరఖాస్తుదారులు వేలాదిగా దరఖాస్తులు చేసుకోవాలని, జిల్లా ఉన్నతాధికారులు పదేపదే ప్రకటనలు ఇస్తున్న నేపథ్యంలో, యువత మీసేవ తహసిల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

రాజీవ్ యువ వికాస పథకంలో కొన్ని కేటగిరీలకు సంబంధించిన యూనిట్లకు వయసు పరిమితిని అధికారులు, ప్రకటించిన విధంగా కాకుండా ఆన్లైన్లో మరో విధంగా కొర్రీలు కనబడుతున్నాయని దరఖాస్తుదారులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో పలు రాజకీయ పార్టీలు నిరుద్యోగ యువత పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రాజీవ్ యువ వికాస పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు గడువును పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు చివరి రోజైన నేడు కూడా అంబేద్కర్ జయంతి సందర్భంగా సెలవు దినంగా ఉండడంతో అనేక ఇబ్బందులు తప్పవని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని అవాంతరాల మధ్య, సమయానికి దరఖాస్తులు అందజే లేకపోయిన నిరుద్యోగ యువత మరో మారు రాజీవ్ వికాస పథకం దరఖాస్తు గడువును పెంచాలని విజ్ఞప్తి.

## ఖమ్మంలో దారుణం

### భర్త హత్యకు కుట్ర, సుపారీ కేసులో ఐదుగురు అరెస్ట్

**ఖమ్మం, ఏప్రిల్ 13,మహా:** ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం సువర్ణపూరం గ్రామానికి చెందిన తొట దర్మ అనే వ్యక్తిని హత్య చేసేందుకు రూపొందించిన కుట్రను ఖానాపురం హవేలీ పోలీసులు భగ్నం చేశారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో ఈ కుట్ర జరిగినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ కేసులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఖానాపురం హవేలీ ఇన్‌స్పెక్టర్ భానుప్రకాశ్ తెలిపారు. కేసు వివరాలు.. సువర్ణపూరం గ్రామానికి చెందిన కొండూరి రామంజనేయులు (34) అలియాస్ రాము, దర్మ భార్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయం దర్మకు తెలియడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. దర్మను అడ్డు తొలగించి తన అక్రమ సంబంధాన్ని కొనసాగించాలనే ఉద్దేశంతో రామంజనేయులు హత్యకు పథకం రూపొందించాడు. ఈ కుట్రలో భాగంగా ఖమ్మం రూరల్ మండలం బారుగూడెం గ్రామానికి చెందిన దంతాల వెంకట నారాయణ అలియాస్ వెంకట్ (31)తో రామంజనేయులు సంప్రదించాడు. వెంకట్, తన స్నేహితుడు, రౌడీ షీటర్ అయిన పగాడాల విజయ్ కుమార్ అలియాస్ చంటి (30)ని రామంజనేయులుకు పరిచయం చేశాడు. హత్యకు 20 లక్షల రూపాయల సుపారీ ఒప్పందం కుదిరింది. అడ్వాన్స్‌గా 5 లక్షల రూపాయలు చెల్లించారు.

## టాలెంట్ టెస్టులు నిర్వహించకూడదు

**సత్తుపల్లి - మహా:** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సత్తుపల్లిలో నారాయణ స్కూల్ లో ఆదివారం టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తుండగాపలువురు ఆ పాఠశాలకు వెళ్లి ఆందోళన చేశారు. టాలెంట్ టెస్టులు పేరిట విద్యార్థులను వారి తల్లిదండ్రులను చేస్తున్న మోసాలపై నిలదీశారు.అక్కడ ఆందోళన ఉద్రిక్త పరిస్థితికి దారి తీసిన విషయం స్థానిక మండల విద్యాశాఖ అధికారి దృష్టికి వెళ్లడంతో ఆయన నారాయణ స్కూల్ కి వెళ్లి పరీక్షను నిలుపుదల చేశారు.విద్యార్థుల దగ్గర్నుంచి సమాధాన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. టీచర్లను క్లాసులకు పంపడం ఆపి అడ్మిషన్ల కోసం సెలవు దినాలు, ఎండ, రాత్రి అని చూడకుండా రోడ్ల వెంట తిప్పుతున్నారని , వారికి అడ్మిషన్లు టార్గెట్లు పెడుతున్నారని ఎంఈఓ దృష్టికి తెచ్చారు. టాలెంట్ టెస్టులు, అడ్మిషన్ టెస్టులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎంఈఓ హెచ్చరించారు. టాలెంట్ టెస్ట్ విషయం జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకురావడం జరిగిందని డీఈవో ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో నిరసన కారులు ఆందోళన విరమించారు. స్థానిక కార్పొరేట్ పాఠశాలల వారు తమ గొప్పను చాటుకునేందుకు, రాష్ట్రస్థాయి ర్యాంకులు తమవే అని ప్రకటించుకునేందుకు విజయవాడ ,గుడివాడ తదితర ప్రాంతాలలో పదవ తరగతి చదివిన మెరిట్ విద్యార్థులను ఇక్కడకు తీసుకొచ్చి తమ పాఠశాల తరఫున ఫీజు కట్టి పరీక్షలు రాయించాలని స్థానిక ప్రైవేట్ పాఠశాలల వారు ఎంఈఓ కు ఫిర్యాదు చేశారు.